# పలు రంగాల్లో కీలక భాగస్వామ్యం

**చెన్నై, న్యూస్‌టుడే:** భారతదేశంతో వైద్య, విద్య పరిశ్రమలతోపాటు పలు రంగాల్లో తమ దేశ భాగస్వామ్యపాత్ర కొనసాగుతోందని చెన్నైలోని బ్రిటీష్ దౌత్యకార్యాలయ డిప్యూటీ హైకమిషనర్ మైక్ నితా వ్రియానకిస్ ఆనందం వ్యక్తం చేశారు. 20 నెలల క్రితం 'ఇండో బ్రిటీష్ హెల్త్ ఇన్షియేటివ్ (ఐబీహెచ్‌ఐ) పేరిట మియాట్ ఆసుపత్రితో కుదుర్చుకున్న ఒప్పందంతో చికిత్సాపరంగా పలు అంశాలు కార్యరూపంలోకి వస్తున్నాయని తెలిపారు. ఐబీహెచ్‌ఐ శుక్రవారం నిర్వహించిన ద్వితీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. భారత, బ్రిటన్ దేశాలకు చెందిన వంద మంది క్యాన్సర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. శనివారం కూడా కార్యక్రమం కొనసాగనుంది. వైద్య పరీక్ష పరికరాలు, మందులు, అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విధానాలపై ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. దీనిలో బ్రిటన్‌కు చెందిన సంస్థలు పాలుపంచుకున్నాయి.

అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మైక్ నితావ్రియానకిస్, డాక్టర్ పృథ్వీ లండన్‌కు చెందిన వైద్య నిపుణులు లార్డ్ కక్కర్, అర్నిక్ పురుషోత్తం, ఈ తరహా వ్యాధులకు సంబంధించి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ (న్యూదిల్లీ) డిప్యూటీ కమిషనర్ దామోదర్ బదాని, టాటా మెమోరియల్ (ముంబై), వైద్య నిపుణులు డాక్టర్ రాజేంద్రన్ బద్వేలు మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో క్యాన్సర్ వ్యాధితో మృతిచెందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు. యువ పీజీ వైద్యులను నిపుణులుగా తీర్చిదిద్దే దిశగా ఐబీహెచ్‌ఐ కృషి చేస్తోందని తెలిపారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీ